RNI. APTEL/2008/25441,POSTAL NO. G/RNP/TS/MBN-03/2021-2023





కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మహబూబ్‌నగర్ నగరంలోని అంబేద్కర్ చౌరస్తా బస్టాండ్ వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా మరియు నిరసన తెలియజేశారు


# సత్యవార్త

SATYAVARTHA TELUGU DAILY

మహబూబ్‌నగర్ | గురువారం, జూన్ 11, 2026 | సంపుటి : 18 | సంచిక : 140 | పేజీలు 8 | వెల 2/-


# సొంతంగానే పోటీ చేస్తాం



న్యూఢిల్లీ, జూన్ 10 : తెలంగాణలో బీజేపీ పార్టీ పొత్తులకు సంబంధించి కేంద్రమంత్రి అమిత్ షా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఏ ప్రాంతీయ పార్టీతో పొత్తు ఉండదని తేల్చి చెప్పారు. ఒంటరిగానే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ హైకమాండ్ దృష్టి పెట్టినట్లు స్పష్టం చేశారు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో పొత్తులు పెట్టుకోవడం వల్ల బీజేపీకి లాభం చేకూరలేదని భావిస్తున్న అధిష్ఠానం.. సొంతంగా ఎదగడంపై ఫోకస్ పెట్టింది. తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసే ఉన్నాయంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పదే పదే తీవ్ర విమర్శలు చేస్తూనే ఉన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని.. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో జరిగిన అవినీతిపై నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని హస్తం పార్టీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. తాజాగా మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్ షా.. తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకునేది లేదని స్పష్టం చేశారు. ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేసి.. తెలంగాణ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారి తీస్తున్నాయి. ఇది ఒక సాధారణ రాజకీయ ప్రకటనగా కాకుండా.. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించేందుకు బీజేపీ అవలంబిస్తున్న దీర్ఘకాలిక వ్యూహానికి సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా తెలంగాణలో ఇతర పార్టీలపై ఆధారపడకుండా.. సొంతంగానే బీజేపీని నిలబెట్టాలని దృష్టి పెట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు జరిగే ప్రతి రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ చేసి.. బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తాజాగా అమిత్ షా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దక్షిణాది రాష్ట్రాలు.. మరీముఖ్యంగా తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టిందని కూడా అమిత్ షా తేల్చి చెప్పినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో బీజేపీ.. ఎక్కువకాలం ప్రాంతీయ పార్టీలపై ఆధారపడటం వల్ల.. స్వతంత్రంగా బలాన్ని పెంచుకోలేకపోయామనే భావన బీజేపీ అగ్రనాయకత్వానికి వచ్చిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అందుకే ఇతర పార్టీలపై ఆధారపడకుండా.. బీజేపీ బలాన్ని సొంతంగా పెంచాలని యోచిస్తున్నట్లు అమిత్ షా వ్యాఖ్యలు అర్థం చేసుకోవాలని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం వల్ల.. అప్పటికప్పుడు ఎన్నికల సమయంలో కొన్ని సీట్లు, ఇతర పార్టీలతో కలిసి అధికారంలోకి వచ్చినప్పటికీ.. దీర్ఘకాలంలో మాత్రం అవి బీజేపీని ఎదగకుండా అడ్డుకుంటున్నాయనే ఆలోచనకు బీజేపీ వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే పొత్తుల ద్వారా సీట్లు, అధికారాన్ని దక్కించుకోవడం కంటే.. కాస్త ఆలస్యమైనా సరే సొంతంగా కేడర్, ఓటు బ్యాంకును సాధించాలనే లక్ష్యంతో కమలం పార్టీ అడుగులు వేస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ పార్టీగా ఉన్న శాశ్వతంగా నిలదొక్కుకోవాలంటే.. ఇతర పార్టీలపై ఆధారపడకుండా సొంత బలంతో ఎదగాల్సిందేననే బీజేపీ నాయకత్వం ఆలోచిస్తుందని అభిప్రాయపడుతున్నారు. అమిత్ షా చేసిన ప్రకటనతో ఇప్పుడు తెలంగాణలో త్రిముఖ పోరు నెలకొననుంది. నిజంగానే బీజేపీ పొత్తులు లేకుండా ఎన్నికల బరిలోకి దిగితే.. తెలంగాణ రాజకీయాలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోరుగా కొనసాగనున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# మెట్రోస్టేషన్ల కింద స్టాళ్లపై హైకోర్టు సీరియస్



హైదరాబాద్, జూన్ 10 : మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో ఈరోజు (బుధవారం) విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్‌ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఆర్‌ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ప్రధాని పదవిలో చరిత్ర సృష్టించిన మోదీ మంత్రివర్గం స్టాండింగ్ ఒవేషన్, తీర్మానం



న్యూఢిల్లీ: భారత ప్రధానిగా సుదీర్ఘకాలం పాటు పదవిలో కొనసాగుతూ చరిత్ర సృష్టించినందుకు నరేంద్ర మోదీ (ప్రీవీ వీశీఎఱ)ని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బుధవారంనాడిక్కడ జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ప్రధానమంత్రిని అభినందిస్తూ మంత్రులంతా లేచి నిలబడి చప్పట్లతో 'స్టాండింగ్ ఒవేషన్' ఇచ్చారు. ప్రధానమంత్రి 4,399 రోజుల సుదీర్ఘ పాలన అభినందనీయమని కొనియాడారు. తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత అప్పటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 4,398 రోజులు పదవిలో కొనసాగారు. ఆ రికార్డును ప్రధానమంత్రి మోదీ నేటితో అధిగమించారు. ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అదిపెద్ద పరీక్ష అని ప్రధానమంత్రి మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసినప్పుడే ఎవరైనా ప్రజా విశ్వాసాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ, విదేశీ ప్రముఖులు పలువురు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి మోదీ 12 ఏళ్ల పాలనను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రశంసించారు. వలస పాలకుల హయాంలో ఏర్పడిన న్యూనతను సమర్థవంతంగా ప్రస్తుత ప్రభుత్వం అధిగమించిందంటూ అభినందించారు. కోట్లాది మంది ప్రజలు ప్రేమ, నమ్మకం, ప్రజాదరణతో సుదీర్ఘ పాలన అందించిన క్రెడిట్ ప్రధానమంత్రి మోదీకి దక్కుతుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

# జనసేన సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరాను

హైదరాబాద్, జూన్ 10: ప్రజాసేవకు రాజకీయాలే సరైన వేదిక అని భావించి జనసేన పార్టీలో చేరినట్లు మాజీ తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీ ని [illegible] తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కరోనా వంటి సంక్లిష్ట పరిస్థితుల్లో హెల్త్ డైరెక్టర్‌గా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను దగ్గరగా గమనించానన్నారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే రాజకీయాల్లో ఉండి పనిచేయడం అవసరమని భావించినట్లు చెప్పారు. జనసేన పార్టీ అధ్యక్షుడు ఖజీలిజీని ఐజీశ్రీఎజీని సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని, అందుకే పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

# పీసా చట్టం.. ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం



హైదరాబాద్, జూన్ 10: పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. ఈరోజు(బుధవారం) రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి పేర్కొన్నారు.

# పీఓకేలో ఉద్రిక్తత.. కశ్మీర్‌లో జోజిలా సంబరాలు




న్యూఢిల్లీ: కశ్మీర్ ప్రాంతాల్లో లైన్ ఆఫ్ కంట్రోల్(ఎల్ఓసీ)కి ఇరువైపులా ఒకే సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు భిన్న వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. ఓవైపు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో నిరసనలు, ఉద్రిక్తతలు, భద్రతా బలగాల కాల్పులతో పరిస్థితి ఆందోళనకరంగా మారగా.. మరోవైపు జమ్ముకశ్మీర్‌లో జోజిలా సొరంగం నిర్మాణంలో కీలక మైలురాయి సాధించడంతో అభివృద్ధి సంబరాలు కనిపిస్తున్నాయి. రావలకోట్, ముజఫరాబాద్, మీర్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల నిరసనలు ఉద్ధృతమయ్యాయి. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరకుల ధరలు, ద్రవ్యోల్బణం, పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. దీంతో పలుచోట్ల ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం సహా వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో 30 మందికి పైగా మృతిచెందినట్టు, సుమారు 200 మందికిపైగా గాయపడినట్టు తెలుస్తోంది. దీంతో గిల్గిట్-బాల్టిస్థాన్ ప్రాంతాల్లోనూ అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్నాయి. ఇక.. జమ్ముకశ్మీర్‌లోని సోనమార్గ్, బాల్తాల్, మినామార్గ్ ప్రాంతాల్లో జోజిలా సొరంగ నిర్మాణం కీలక దశను చేరుకుంది. కశ్మీర్, లద్దాఖ్ వైపుల నుంచి తవ్విన మార్గాలు కలవడంతో ఇంజినీర్లు, కార్మికులు విజయోత్సాహం నిర్వహించారు. సుమారు 13.15 కిలోమీటర్ల పొడవుతో నిర్మితమైన ఈ టన్నెల్.. ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ రహదారి సొరంగాల్లో ఒకటి. సముద్రమట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా ఏడాది పొడవునా కశ్మీర్-లద్దాఖ్ మధ్య అనుసంధానానికి సాధ్యం కానుంది. ప్రస్తుతం.. శీతాకాలంలో భారీ మంచు కారణంగా జోజిలా కొన్ని నెలలపాటు మూతపడుతుంది. కానీ టన్నెల్ అందుబాటులోకి రానుండటంతో లద్దాఖ్‌కు నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది. 2019లో ఆర్టికల్ 370 రద్దైనప్పటి నుంచి.. కశ్మీర్‌లో రహదారులు, సొరంగాలు, రైల్వేలు, విద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు భారీగా పెరిగాయి. జెడ్-మోర్హ్ సొరంగం, చెనాబ్ రైల్వే వంతెన, ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే మార్గం, జోజిలా సొరంగం వంటి ప్రాజెక్టులు ప్రాంతీయ అనుసంధానానికి బలం చేకూరుస్తున్నాయి. వందే భారత్ రైళ్లు కశ్మీర్ లోయలో పరుగులు తీయడం, పర్యాటక రంగం విస్తరించడం, కొత్త పెట్టుబడులు రావడం స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తున్నాయి. పీఓకేలో ఆర్థిక సమస్యలు, రాజకీయ అసంతృప్తి, పరిపాలనా వివాదాలు తరచూ ఆందోళనలకు దారితీస్తుండగా.. కశ్మీర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడులు, పర్యాటక రంగం విస్తరణ ప్రధాన చర్చనీయాంశాలుగా నిలుస్తున్నాయి. జూన్ 9న చోటుచేసుకున్న ఈ రెండు సంఘటనలు ఎల్ఓసీకి ఇరువైపులా కశ్మీర్ ప్రాంతాల్లో నెలకొన్న భిన్న పరిస్థితులను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.

# మాట నిలబెట్టుకున్న జూపల్లి

## మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!



రాజకీయాల్లో ఇచ్చిన మాటపై నిలబడే నాయకులు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. ఆ అరుదైన కోవకే చెందుతానని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మరోసారి నిరూపించుకున్నారు. గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారుల భవిష్యత్తుకు బాటలు వేసేలా ఆయన ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. వీపనగండ్లలో మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు వీపనగండ్ల మండలంలో పర్యటించిన సమయంలో స్థానిక యువకులు, క్రీడాకారులు తమ ప్రాంతానికి ఒక మినీ స్టేడియం కావాలని కోరారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. స్టేడియం ఏర్పాటుకు తన సొంత భూమిని ఇస్తానని నాడు హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల అమూల్యమైన భూమిని క్రీడా రంగానికి ధారపోశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ఆన్‌లైన్ పద్ధతిలో పూర్తయింది. వీపనగండ్ల తహశీల్దార్ లాగిన్ ద్వారా జరిగిన ఈ ప్రక్రియలో మంత్రి జూపల్లి స్వయంగా డిజిటల్ సంతకం చేసి సదరు భూమిని ప్రభుత్వానికి అప్పగించారు. ప్రస్తుతం ఈ 4 ఎకరాల భూమి మార్కెట్ విలువ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఈ అధికారిక భూ బదిలీ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ సాక్షులుగా వ్యవహరిస్తూ డిజిటల్ సంతకాలు చేశారు.

## గూడూర్ పంప్ హౌజ్ వద్ద నూతన మోటార్లను పరిశీలించిన ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

### --మూడు భారీ మోటార్లతో నగల్‌గిద్ద, మానూర్ మండలాలకు త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### -- రేపటి నుంచే నీటి సరఫరా ప్రారంభం



సత్య వార్త సంగారెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని నగల్‌గిద్ద మండలంలోని గూడూర్ గ్రామంలో ఉన్న పంప్ హౌజ్ వద్ద సింగూర్ నది కాలువలలో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు భారీ మోటార్లను ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం నాడు పరిశీలించారు.పంప్ హౌజ్ పరిసర ప్రాంతాలకు ఎమ్మెల్యే స్వయంగా బైక్‌పై వెళ్లి మోటార్ల పనితీరు, ఫిట్టింగ్ పనులు మరియు నీటి సరఫరా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు. గూడూర్ పంప్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన ఈ మూడు నూతన మోటార్ల ద్వారా నగల్‌గిద్ద మండలంలోని 33 గ్రామాల పంచాయతీ పాటు మానూర్ మండలంలోని పలు గ్రామాలకు కూడా తగినంత త్రాగునీరు అందుతుందని తెలిపారు.వేసవి కాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా నీటి సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.మోటార్ల ఏర్పాటు పనులు విజయవంతంగా పూర్తయ్యాయని, రేపటి నుంచే వీటి ద్వారా నీటి సరఫరా ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి ఎక్కడా అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.గ్రామ ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రభుత్వ సదుపాయాలను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## NALSA పథకాలతో పిల్లల భవిష్యత్తుకు భరోసా




సత్యవార్త, గద్వాల :

జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (చీూూూూ) రూపొందించిన పిల్లల సంక్షేమం మరియు హక్కుల పరిరక్షణకు సంబంధించిన పథకాల సమర్థవంతమైన అమలుపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి ఏ.నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో మరియు భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల రక్షణ, విద్య, ఆరోగ్యం, బాల కార్మిక నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, అనాథ మరియు నిరాశ్రయ పిల్లలకు న్యాయ సహాయం అందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. చీూూూూ పథకాల లక్ష్యాలను గ్రామ స్థాయి వరకు చేరవేసేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో పాల్గొన్న అధికారులు పిల్లల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయడంతో పాటు, అర్హులైన పిల్లలకు న్యాయ సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. చీూూూూ పథకాల అమలులో భాగస్వామ్య సంస్థల పాత్ర, సమన్వయం మరియు అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఓ సునంద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్య ప్రతిభా పురస్కారాల కార్యక్రమం

మహబూబ్నగర్ ( సత్యవార్త ప్రతినిధి):

మహబూబ్‌నగర్ జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం – మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో ఏకలవ్య "ప్రతిభా పురస్కారాల కార్యక్రమము" బుధవారం అంబేద్కర్ కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సభ అధ్యక్షులుగా, టీచర్ వెంకట రాములు కార్యదర్శిగా, టీచర్ పర్వతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఎస్ఎస్సి /ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎరుకల ఉద్యోగుల సంఘం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తు. "చదువే మన భవిష్యత్తుకు మూలస్తంభం. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని కష్టపడాలి" అని పిలుపునిచ్చిరు ఈ కార్యక్రమంలో 40 మంది మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, నోట్ బుక్స్ పెన్నులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్,మానపాడు బాలయ్య ఆర్డబ్ల్యుఎస్ ఎస్సి ఈ,ఆంజనేయులు, కొత్తపల్లి,మండల విద్యాధికారి ,ఆంజనేయులు, ఇరిగేషన్ ఏవో,




హనుమంతు, రిటైర్డ్ కో-ఆపరేటివ్ రిజిస్టర్, రాములు, వార్డెన్,రమణయ్య డిగ్రీ లెక్చరర్, మహేందర్, టీచర్ కృష్ణయ్య టీచర్ శ్రీరాములు గొల్లపల్లి,రాములు, తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు,మల్లేష్ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షులు, శేఖర్ గద్వాల జిల్లా నాయకులు, మధు బాలస్వామి,ఈశ్వర్, శేఖర్ రాములు, పవన్, ఎరుకల సంఘ పెద్దలు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## "మీ కోసం ఒక కుటుంబం ఎదురుచూస్తోంది... - జాగ్రత్తగా వాహనం నడపండి"

### -హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం ప్రాణరక్షణకు కవచం : అదనకు డీజీపీ స్వాతి లక్రా



సత్య వార్త బాలానగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణలో భాగంగా.. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పీఎం శ్రీ పాఠశాల కళాశాలలో "ూా=-=×ఎజు-ూూా×ఎజు" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీమతి స్వాతి లక్రా, ఐపీఎస్, డీజీపీ ఆర్గనైజేషన్ ఁ హోంగార్డ్స్ తెలంగాణ హాజరయ్యారు. ముందుగా జిల్లా ఎస్పీ డి.జానకి సభను ఉద్దేశించి ప్రారంభ సందేశాన్ని అందించారు. అనంతరం ముఖ్య అతిథి స్వాతి లక్రా మాట్లాడుతూ. "కుటుంబ సభ్యులు మీ కోసం ఇంట్లో ఎదురు చూస్తున్నారని ఎల్లప్పుడూ గుర్తుంచుకొని వాహనాలను నడపాలి" అని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో సంభవించే మరణాలు మరియు తీవ్ర గాయాలలో దాదాపు 90 శాతం వరకు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ చలో కలెక్టరేట్




సత్య వార్త నాగర్ కర్నూల్ జూన్ 10

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ధరల పెంపును ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో "చలో కలెక్టరేట్" ఆందోళన నిర్వహించారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, జిల్లా కార్యదర్శి ఎస్.ఎండి. ఫయాజ్ మాట్లాడుతూ డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర సరుకులు, ఎరువుల ధరలు అడ్డుఅదుపు లేకుండా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. అంతర్జాతీయ చమురు ధరలు 2013 కన్నా తక్కువ ఉన్నా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచారని విమర్శించారు. ధరలు తగ్గించే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.రైతులకు ఎరువులు అందుబాటులో లేవని, వడ్ల డబ్బులు అకౌంట్లలో పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రూ.2500 మహిళా పింఛన్లు, నిరుద్యోగ భృతి, పేదలకు ఇంటి స్థలాల పట్టాలు, జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.విజ్ఞప్తి పత్రాన్ని కలెక్టరేట్ సమన్విత అధికారి మహమ్మద్ అలీకి అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హెచ్. ఆనంజి, కేశవులు గౌడ్, తన్నీరు నరసింహ, పెబ్బేటి విజయుడు తదితరులు పాల్గొనరు

## గ్రేటర్ లో టీడీపీ పోటీ

హైదరాబాద్, జూన్ 10 : ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది.మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారే. గులాబీ పార్టీలో అయితే ఆ పార్టీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు అంతా టిడిపి దే. కాంగ్రెస్ పార్టీలో కూడా మెజారిటీ నాయకత్వం టిడిపి నుంచి వెళ్ళింది. అయితే ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. ఆ పార్టీలో ఉన్న పూర్వపు టిడిపి నేతలు అంతా పూర్వాశ్రమం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారట. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే చంద్రబాబుకు చాలామంది టచ్లోకి వచ్చారట. సరైన సమయం చూసి చెబుతానని బాబు చెప్పారట. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో

## రేవంత్ మైండ్ గేమ్ లో కేసీఆర్



హైదరాబాద్, జూన్ 10 : కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదాం. ఒకవేళ ఆ చర్చలో నేను ఓడిపోతే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతా" "వచ్చే ఎన్నికల్లో నా సంగతి చూస్తానంటున్న కేసీఆర్ కు పాలమూరు గడ్డపై సవాలు విసురుతున్నా. నిన్ను మళ్లీ మొలకెత్తనివ్వం. మీ పార్టీ జెండాలు ఎగురనివ్వం. గద్దెలు కూలుతాయి. పార్టీ గుర్తును మర్చిపోవాల్సిందే" "వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావటం ఖాయం. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు తథ్యం. వచ్చే ఎన్నికల్లో ఆయన డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఊళ్లలో కేసీఆర్ ఓట్లు అడగాలి. నేను ఇందిరమ్మ ఇళ్లు కట్టిన ఊళ్లల్లో ఓట్లు అడుగుతా. ఇలా చేస్తే కేసీఆర్ కు డిపాజిట్లు కూడా రావు'. "పాలూమరు ప్రాజెక్టులపై పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బయలుదేరారు. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వాళ్ల పాపాలు తీరవు. ప్రజలు క్షమించరు" "ప్రజలు ఇచ్చిన ధైర్యంతో గల్లీలో ఉండే కేడీతోనైనా.. ఢిల్లీలో ఉండే మోడీతో అయినా కొట్లాడతా. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక రెండుసార్లు ముఖ్యమంత్రి చేశాం. దొంగలకు సద్దులు మోసే వారితో జాగ్రత్తగా ఉండాలి. మన వారైనా అప్రమత్తత అవసరం. వనపర్తిలో ఒకరు.. పాలమూరులో ఒకరు మోపు అయ్యారు.తాజాగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ప్రజాపాలన - ప్రగతి ఉత్సవాల సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో కీలకమైనవి. ఎప్పటిలానే ఆయన తరచూ తాను చెప్పే కొన్ని మాటల్ని ఈ సభలోనూ రిపీట్ చేశారు. ఎప్పటిలానే మరోసారి కేసీఆర్ కు సవాలు విసిరారు. గతంలో అసెంబ్లీకి రావాలని తరచూ కోరే ఆయన..ఇటీవల కాలంలో అసెంబ్లీలో చర్చకు రావాలన్న ఛాలెంజ్ చేశారు. గతానికి ఈసారి తేడా ఒక్కటే. అసెంబ్లీలో నిర్వహించే చర్చలో తాను కానీ ఓడితే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో రాజకీయాన్ని ఏకపక్షం చేసుకోవాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాజకీయాల్లో అదను చూసి దెబ్బ తీయాలని సామెత ఉంది. విపక్షం వీక్ గా ఉన్నపుడే జోరు చేయాలని తెలిసిన వారే ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ఇపుడు అదే పంథాను అనుసరిస్తున్నారు. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అయితే గత రెండున్నరేళ్ళుగా ఫాం హౌజ్ లోనే ఉంటున్నారు. ఓటమి తరువాత ఎందుకో ఆయన మునుపటి మాదిరిగా దూకుడు చేయడం లేదు. దాంతో ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి పెద్ద అడ్వాంటేజ్ గా తీసుకుని స్పీడ్ పెంచేశారు అని అంటున్నారు. రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికలు నేడో రేపో అన్నట్లుగా ఆయన హడావుడి చేస్తున్నారు. తాజాగా చూస్తే ఆయన బీఆర్ఎస్ కి బలం ఉంది అన్న చోట పాలమూరు లో పర్యటించారు. అక్కడ భారీ బహిరంగ సభను నిర్వహించడమే కాదు ఏకంగా కేసీఆర్ కే సవాల్ చేశారు. తన రెండున్నరేళ్ల పాలన కేసీఆర్ పదేళ్ల పాలనకు తేడా ఏంటో చర్చిద్దాం సిద్ధమేనా అని సవాల్ చేశారు. కేసీఆర్ చర్చకు రెడీ అంటే తాను కూడా రెడీ అన్నారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో తాను బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తున్నానని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఇక ఈ మధ్య కాలంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని తమ ప్రభుత్వం ఏమి చేసిందో తాను చెబుతాను అని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.కేసీఆర్ అయితే జనం లోకి రావడం లేదు. ఆయన గత డిసెంబర్ లో ప్రెస్ మీట్ పెట్టారు. ఒక రోజు శీతాకాల సమావేశాలకు అటెండ్ అయ్యారు. 2026 లో కొత్త ఏడాదిలో మూడు ప్రాంతాలలో మూడు భారీ బహిరంగ సభలు పెడతామని కూడా ప్రకటించారు. కానీ అవేమీ జరగలేదు. యధా ప్రకారం కేసీఆర్ ఫాం హౌజ్ కే పరిమితం అయిపోయారు. మరో వైపు బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్ళి కొత్త పార్టీని పెట్టుకుంది ఆమె బాణాలు బీఆర్ఎస్ మీదనే ఎక్కుపెడుతోంది. అదొక చికాకు అనుకుంటే హరీష్ రావు బీజేపీలో చేరిపోతున్నారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు మరో చికాకుగా మారాయి. వాటికి హరీష్ రావు ధీటుగా బదులిస్తూ ఖండిస్తున్నప్పటికీ జనంలో గులాబీ పార్టీ రేకులు విడిపోతున్నాయని చెప్పడానికే ఈ వ్యూహాత్మకమైన విమర్శలు అన్నది కూడా ఉంది. ఇక కేటీఆర్ విమర్శలు కానీ ఆయన స్టేట్మెంట్స్ కానీ కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. తన మీదకు ఇద్దరు నాయకులను వదిలేశారని కానీ వారి వల్ల ఏమీ కాదని రేవంత్ రెడ్డి హరీష్ కేటీఆర్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు గమనార్హం. తనకు సమ ఉజ్జీ కేసీఆర్ తప్ప బీఆర్ఎస్ లో ఎవరూ కారని రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కేసీఆర్ ఇప్పటప్పట్లో వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదని అంటున్నారు. దాంతో రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయం తెలంగాణాలో కొనసాగుతోంది. పైగా 2034 వరకూ మాదే అధికారం అని బల్ల గుద్ది మరీ రేవంత్ రెడ్డి చెబుతున్నారు.

## భారత్ మాల బాధితుల ఫిర్యాదులు: ఎంక్వయిరీ చేస్తున్న ఆర్డిఓ

సత్య వార్త.మక్తల్.

భారత్ మాల రోడ్డు విస్తరణాలో భూములు కోల్పోయి సంవత్సరాలు గడుస్తున్నా తమకు నష్టపరిహారం రాక ప్రభుత్వ పథకాలు అందగా ఇబ్బంది పడుతున్నామని రైతుల ఫిర్యాదు చేశారు .బుధవారం రోజు సాయంత్రం దాసర్పపల్లి గ్రామంలో వీరి పేరున ఉన్న పట్టా భూమిలో భారత్ మాల రోడ్డు వెళ్లిందా లేదని నిర్ధారణ చేసుకునేందుకు ఆర్డిఓ ఎల్ రమేష్. తాసిల్దార్ సతీష్ కుమార్. సర్వేయర్ రాజన్న సహాయంతో లొకేషన్ లో ఎంక్వయిరీ చేశారు.మక్తల్ మండలంలోని దాసరపల్లి గ్రామానికి చెందిన ఐదు మంది రైతులు దాదాపు 15 ఎకరాల పొలం భారత్ మాల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం వ్యవసాయ భూమిని సేకరించా రు.కలెక్టర్ అవార్డు ప్రకటించిన రెండు సంవత్స రాలైన తమకు ఇప్పటికి నష్టపరిహారం రాలేదని ప్రభుత్వం సేకరించి అవార్డు ప్రకటించడంతో భూమికి నష్టపలేరు రాక ఆ భూమిపై ప్రభుత్వ పథకాలైన రైతుబంధు. పీఎం కిసాన్ సహాయం. క్రాప్ లోన్లు తీసుకోలేక




ఇబ్బంది పడ్తున్నామని. రైతులు కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరిగింది. వీరు ఫిర్యాదుల పేర్కొన్న సర్వే నంబర్లో బారత్ మాల రోడ్డు కోసం సేకరించిన అందుకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిన.నగదు ప్రభుత్వ ఖజానాలో జమ ఉన్నాయని వాటిని త్వరలో బాధితులకు చెక్కుల రూపంలో అందజేస్తానని. తాసిల్దార్ సతీష్ కుమార్ సమక్షంలో రైతులకు ఆర్డిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్ ఐ భూపాల్ రెడ్డి సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

# చైనాతో పోలిస్తే భారత్‌లో కంపెనీలకు ప్రభుత్వ మద్దతు తక్కువే

దిల్లీ: 2005–2024 మధ్య కాలంలో భారతీయ సంస్థలు తమ చైనా ప్రత్యర్థి కంపెనీల కంటే గణనీయంగా తక్కువ ప్రభుత్వ మద్దతును పొందాయని ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) నివేదిక వెల్లడించింది. సంస్థలు వాస్తవంగా ఏమి పొందుతున్నాయో (ప్రభుత్వాలు వెల్లడించేది కాదు) ఓఈసీడీ మ్యాజిక్ డేటాబేస్ ఆఫ్ ఇండస్ట్రియల్ సబ్సిడీస్ కొలుస్తుంటుంది.

ఇది 2005–24 మధ్య కాలంలో 15 కీలక రంగాల్లో ప్రపంచంలోని 525 అతి పెద్ద తయారీదార్లను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించింది. ఈ కొలత మూడు సాధనాల ద్వారా జరుగుతుంది. అందులో గ్రాంట్లు, ఆదాయపు పన్ను రాయితీలు, మార్కెట్ విలువ కంటే తక్కువ వడ్డీకి రుణాలు ఉన్నాయి. 2005–24 మధ్య కాలంలో చైనా సంస్థలు ఓఈసీడీ ఆధారిత సంస్థల కంటే సగటున 3–8 రెట్లు ఎక్కువగా ప్రభుత్వ మద్దతు పొందాయి. బ్రెజిల్, భారత్, ఇండోనేషియా వంటి ఓఈసీడీ యేతర ఆర్థిక వ్యవస్థల్లోని సంస్థలు పొందిన మద్దతు కంటే ఈ సబ్సిడీలు ఎక్కువగా ఉన్నాయి. ఇది చైనా తయారీ రంగ పోటీతత్వం వెనుక ఉన్న కీలక కారకాలలో ఒకదాన్ని ప్రతిబింబిస్తోందని నివేదిక తెలిపింది. ఓఈసీడీ అనేది ప్రధానంగా అభివృద్ధి చెందిన 38 ఆర్థిక వ్యవస్థలతో కూడిన ఒక అంతర్ ప్రభుత్వ సంస్థ. ఇది సభ్య దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, వాణిజ్యం, పెట్టుబడి, విధాన సమన్వయాన్ని ప్రోత్సహించడానికి పని చేస్తుంది. దీని సభ్య దేశాల్లో అమెరికా, యూకే, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా ఉన్నాయి.




# మార్కెట్లను కమ్మిన యుద్ధభయాలు.. నష్టాల్లో సూచీలు

దేశీయ మార్కెట్లను యుద్ధభయాలు కమ్మాయి. దాంతో సోమవారం సూచీలు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి సెన్సెక్స్ 800 పాయింట్ల మేర కుంగింది. ఉదయం 9.33 గంటల సమయంలో సెన్సెక్స్ 675 పాయింట్లు కోల్పోయి, 73,567 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 215 పాయింట్ల నష్టంతో 23,150 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.35గా ఉంది. నిఫ్టీ సూచీలో సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అపోలో హాస్పిటల్స్, యాక్సిస్ బ్యాంక్, నెస్లే షేర్లు లాభాల్లో ఉన్నాయి. విప్రో, టీసీఎస్, ఎంఅండ్‌ఎం, హిందాల్కో, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు నష్టాల్లో ఉన్నాయి. ఇరాన్ మధ్య ఏప్రిల్ 8 తర్వాత మరోసారి తీవ్రస్థాయి ఘర్షణలు మొదలయ్యాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇరాన్ ప్రతిదాడులు మొదలుపెట్టింది. శాంతి ఒప్పందానికి తాము చాలా దగ్గరగా ఉన్నామని ఇలాంటి సమయంలో దాడులు వద్దని ట్రంప్ చెప్తున్నా.. ఇజ్రాయెల్ పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.

ఈ ఘర్షణలతో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. ఒక బ్యారెల్ ధర మూడు శాతం మేర పెరిగి.. 96 డాలర్ల పైనే ఉంది. ఈ పరిణామాలు నష్టాలకు కారణమవుతున్నాయి.



# ఎస్ఏఎఫ్ అభివృద్ధిని వేగవంతం చేయాలి...



**రియో డి జనీరో (బ్రెజిల్) :** ప్రస్తుత ఇంధన సంక్షోభం నేపథ్యంలో పర్యావరణ అనుకూలమైన పునరుత్పాదక ఇంధనాలు, ముఖ్యంగా సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్) అభివృద్ధిని మరింత వేగవంతం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని విమానయాన సంస్థల సంఘం ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. రియో డి జనీరోలో జరుగుతున్న ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, విమాన ఇంధన ధరల పెరుగుదల, ప్రత్యామ్నాయ పర్యావరణ ఇంధనాల అవసరాలపై కీలక చర్చలు జరిగాయి. 2050 నాటికి సున్నా కర్బన లక్ష్యాన్ని చేరుకుంటామని విమానయాన రంగం ప్రతిజ్ఞ చేసి అయిదేళ్లు గడుస్తున్నా, 2026లో అంతర్జాతీయ ఎస్ఏఎఫ్ ఉత్పత్తి కేవలం 2.4 మిలియన్ టన్నులుగా మాత్రమే ఉంది. ఇది ప్రపంచ విమాన ఇంధన వినియోగంలో కేవలం 0.8 శాతం మాత్రమే. దీని కోసం విమానయాన సంస్థలు 4.3 బిలియన్ డాలర్ల భారీ వ్యయాన్ని భరిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎస్ఏఎఫ్ ఉత్పత్తి సామర్థ్యం 9 మిలియన్ టన్నులు ఉన్నప్పటికీ.. ప్రభుత్వ విధానాల కారణంగా కంపెనీలు పునరుత్పాదక డీజిల్ ఉత్పత్తికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని ఐఏటీఏ నెట్ జీరో రీసెర్చ్ హెడ్ ప్రీతి జైన్ విమర్శించారు. చమురు కంపెనీల ఉదాసీనత, ప్రభుత్వ విధానాల వల్ల 2050 నాటికి 65% ఇంధన భర్తీ చేయాలనే లక్ష్యం ఏటా కష్టతరంగా మారుతోందని విల్లీ వాల్ష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏటీఎఫ్ ధరల స్థిరీకరణ నిధి భేష్: విమాన ఇంధన (ఎఫ్‌టీఎఫ్) ధరల అస్థిరత సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం రూ.10000 కోట్ల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం చాలా మంచి నిర్ణయమని ఐఏటీఏ ఎనర్జీ ట్రాన్సిషన్ డైరెక్టర్ హేమంత్ మిస్త్రీ ప్రశంసించారు. సగానికి తగ్గనున్న విమానయాన పరిశ్రమ లాభం!: పశ్చిమాసియా సంక్షోభం వల్ల అంతర్జాతీయ విమానయాన పరిశ్రమ మొత్తం నికర లాభం 2026లో సగానికి తగ్గి 23 బిలియన్ డాలర్ల(సుమారు రూ.2.2 లక్షల కోట్లు)కు చేరొచ్చని ఐఏటీఏ అంచనా కట్టింది. అంతే కాక నికర లాభాల మార్జిన్ సైతం 2 శాతానికి తగ్గుతుందని తెలిపింది. ఒక్కో ప్రయాణికుడిపై నికర లాభం 4.5 డాలర్లకు పరిమితం కావొచ్చని అంటోంది. 2025లోని 9.10 డాలర్లతో పోలిస్తే ఇది సగం కంటే తక్కువ. విమాన ఇంధన ధరలు 70% మేర పెరగడంతో లాభాలపై ప్రభావం పడిందని తెలిపింది.


# ముడి చమురు ధరలే కీలకం....




పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో నెలకొన్న ప్రతికూల సెంటిమెంటు కారణంగా, ఈ వారంలో స్టాక్‌మార్కెట్ గమనంపై విశ్లేషకుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (ఆర్‌బీఐ) ప్రభుత్వం ప్రకటించిన చర్యలు రూపాయి విలువ పతనాన్ని అరికట్టగలవని భావిస్తున్నందున మార్కెట్‌లో రికవరీ వస్తుందని కొంత మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే విదేశీ పెట్టుబడిదారులు కొనుగోలుదార్లుగా మారాలంటే ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు ఆర్థిక వృద్ధి కూడా మెరుగుపడాలని అంటున్నారు. నిఫ్టీ–50 సూచీకి 24,000 పాయింట్ల వద్ద నిరోధం, 23,150 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.6 శాతానికి తగ్గించడం, రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను 5.1 శాతానికి పెంచడం ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని వాస్తవికంగా అంచనా వేసినట్లు ఒక విశ్లేషకుడు తెలిపారు. ద్రవ్యోల్బణం పెరిగితే ఈ ఏడాది చివర్లో కీలక రేట్ల పెంపు ఉండొచ్చని అంచనా వేశారు. ముడి చమురు ధరలు, రూపాయి మారకపు విలువ, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు ఒక పరిమిత శ్రేణికి లోబడి కదలాడవచ్చు. సమీప భవిష్యత్తులో ఈ రంగంలో సానుకూల వార్తలేవీ లేకపోవడం ఇందుకు కారణం.రుతుపవనాల ప్రారంభంతో గిరాకీ మందగించే అవకాశం ఉన్నందున, సమీప భవిష్యత్తులో లోహ కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ఉంది.ఔషధ కంపెనీల షేర్లలో ఎలాంటి సానుకూల వార్తలూ లేనందున, ఒక శ్రేణిలోనే కదలాడవచ్చు. ధర తగ్గినప్పుడల్లా ట్రేడర్లు కొనుగోలు చేయొచ్చు. సిమెంటు కంపెనీల షేర్లు ఈ వారమూ నష్టపోవడానికే అవకాశాలున్నాయి. పెట్రోలియం కోక్ ధరల పెరుగుదల కంపెనీలకు ప్రధాన ప్రతికూలతగా ఉండొచ్చు. సిమెంటుకు గిరాకీ కూడా తగ్గొచ్చు. నిఫ్టీ వాహన సూచీ ప్రస్తుతం రోజువారీ చార్టుల్లో స్పష్టమైన దిశను సూచించడం లేదు. అయితే 25,900 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు, 26,500–26,800 పాయింట్ల మధ్య నిరోధం ఎదురుకావొచ్చు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం ముడి చమురు, గ్యాస్ కంపెనీల షేర్లపై ప్రభావం చూపొచ్చు. అప్‌స్ట్రీమ్ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరంలో బలమైన ఆదాయాలు నమోదు చేయొచ్చని అంచనా. డౌన్‌స్ట్రీమ్ కంపెనీలు బేరిష్ ధోరణిలో కదలాడొచ్చు.నిఫ్టీ బ్యాంక్ సూచీ పరిమిత శ్రేణిలోనే చలించొచ్చు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడిదార్లకు ప్రభుత్వం కల్పిస్తున్న పన్నుల ఉపశమనం సానుకూల అంశాలుగా ఉన్నాయి.టారిఫ్‌లు పెంచే అవకాశం ఉన్నందున టెలికాం షేర్లకు సానుకూల అంచనాలనే విశ్లేషకులు వెలువరిస్తున్నారు. ఈ రంగ సూచీకి తక్షణ మద్దతు 3,505 వద్ద, నిరోధం 3,750 వద్ద కనిపిస్తోంది. అధిక ముడి చమురు ధరల వల్ల మార్జిన్లు తగ్గొచ్చనే కారణంగా, యంత్రపరికరాల కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. దీర్ఘకాలంలో ఈ రంగంలోని షేర్లు బలమైన ఆదాయాలు నమోదు చేయొచ్చనే అంచనాలున్నాయి. అయితే అమెరికా–ఇరాన్ యుద్ధం, అధిక వాల్యుయేషన్లు ప్రతికూల అంశాలుగా కనిపిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో ఐటీ కంపెనీల షేర్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉంది. అయితే విదేశీ పెట్టుబడిదారులు కొనుగోలుదార్లుగా మారాలంటే ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు ఆర్థిక వృద్ధి కూడా మెరుగుపడాలని అంటున్నారు. నిఫ్టీ–50 సూచీకి 24,000 పాయింట్ల వద్ద నిరోధం, 23,150 పాయింట్ల వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.6 శాతానికి తగ్గించడం, రిటెయిల్ ద్రవ్యోల్బణ అంచనాలను 5.1 శాతానికి పెంచడం ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని వాస్తవికంగా అంచనా వేసినట్లు ఒక విశ్లేషకుడు తెలిపారు. ద్రవ్యోల్బణం పెరిగితే ఈ ఏడాది చివర్లో కీలక రేట్ల పెంపు ఉండొచ్చని అంచనా వేశారు. ముడి చమురు ధరలు, రూపాయి మారకపు విలువ, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే.. ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్లు ఒక పరిమిత శ్రేణికి లోబడి కదలాడవచ్చు.

సమీప భవిష్యత్తులో ఈ రంగంలో సానుకూల వార్తలేవీ లేకపోవడం ఇందుకు కారణం. రుతుపవనాల ప్రారంభంతో గిరాకీ మందగించే అవకాశం ఉన్నందున, సమీప భవిష్యత్తులో లోహ కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ఉంది.ఔషధ కంపెనీల షేర్లలో ఎలాంటి సానుకూల వార్తలూ లేనందున, ఒక శ్రేణిలోనే కదలాడవచ్చు.అయితే ర్యాలీలు, దిద్దుబాట్ల మధ్య వాటి ధరలు ప్రస్తుత స్థాయుల వద్దే కొనసాగే అవకాశం ఉంది.

# సెబీ సరిగా గుర్తించలేకపోయింది.....




దిల్లీ: మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ఇప్పటికే 300–400 గిగాబైట్ల(జీబీ) మేర పత్రాలను సమర్పించామని బంగారం శుద్ధి, ఆభరణాల ఎగుమతి సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ఆదివారం తెలిపింది. అయితే సరైన ఫైళ్లను సెబీ గుర్తించలేకపోయిందని భావిస్తున్నామని పేర్కొంది.

దీన్ని పరిష్కరించడానికి, సెబీ కోరిన పత్రాలను 15 రోజుల్లోగా తిరిగి సమర్పిస్తామని వెల్లడించింది. 2020–21 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో రూ.15.15 లక్షల కోట్ల మేర ఆదాయాన్ని పెంచి చూపారని ఆరోపిస్తూ జూన్ 3న సెబీ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుకు ఒక ప్రాథమిక అకౌంటింగ్ లోపమే మూలమని కంపెనీ వ్యవస్థాపకులు, ఛైర్మన్ రాజేశ్ మెహతా వెల్లడించారు. నియంత్రణ సంస్థ కంపెనీ ఎబిటా గణాంకాలను తీసుకుని వాటిని ఆదాయంగా వర్గీకరించడంతోనే లోపం తలెత్తిందని పేర్కొన్నారు.

ఎబిటా అంటే స్థూల ఆదాయం కిందకు వస్తుందని, దాన్ని సెబీ ఆదాయంగా వర్గీకరించిందని వివరించారు. పీఎల్ఐ పథకం నుంచి తొలగింపు!: రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ భారీ ఆర్థిక మోసానికి పాల్పడిందని ఆరోపిస్తూ సెబీ గత వారం 109 పేజీల మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీ స్టోరేజ్ కోసం ఉద్దేశించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం కింద లబ్ధిదారుల జాబితా నుంచి ఆ సంస్థను తొలగించే అవకాశం కనిపిస్తోంది.

దీన్ని పరిష్కరించడానికి, సెబీ కోరిన పత్రాలను 15 రోజుల్లోగా తిరిగి సమర్పిస్తామని వెల్లడించింది. ఈ విషయంపై భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఐ) త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కిర్గిజ్‌స్థాన్ అధికారిక పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి దృష్టికి ఈ విషయాన్ని తీసుకురానున్నారు. ఆ తర్వాత తుది నిర్ణయం వెలువడుతుందని మంత్రిత్వ శాఖలోని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

## Cine

# ప్రముఖ దర్శకుడు భారతీ రాజా మృతి



భారతీయ సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన ప్రతిభతో వెండితెరపై సరికొత్త విప్లవాన్ని సృష్టించిన ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీ రాజా (84) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, బుధవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ వార్త వినగానే తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఎందరో నటీనటులను, దర్శకులను పరిచయం చేసిన ఒక గొప్ప గురువుని కోల్పోయామని సినీ లోకం కన్నీరు మున్నీరవుతోంది. భారతీ రాజా గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, గత ఏడాది ఆయన కుమారుడు మనోజ్ హఠాన్మరణం చెందడం ఆయన్ను మానసికంగా తీవ్రంగా కుంగదీసింది. ఆ పుత్రశోకం నుంచి ఆయన కోలుకోలేకపోయారు. ఇక ఆ ఆవేదనతోనే ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. బుధవారం ఉదయం పరిస్థితి విషమించడంతో ఆయన కన్నుమూశారు. భారతీ రాజా కేవలం దర్శకుడు మాత్రమే కాదు, సినిమా రూపురేఖలను మార్చిన విప్లవకారుడు. ఇక అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను, పల్లెటూరి పచ్చదనం వైపు, సహజత్వం వైపు నడిపించిన ఘనత ఆయనదే. ఆయన సినీ ప్రయాణంలో 40కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి ఎన్నో మైలురాళ్లను అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులతో ప్రత్యేక బంధం: ఆయన ఎక్కువగా తమిళ సినిమాలు తీసినప్పటికీ, తెలుగు ప్రేక్షకులతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. తెలుగులో ఆయన నేరుగా దర్శకత్వం వహించిన 'సీతాకోక చిలుక', 'కొత్త జీవితాలు', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ముఖ్యంగా 'సీతాకోక చిలుక' సినిమా తెలుగు సినీ చరిత్రలో ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. అద్భుతమైన ప్రతిభను పరిచయం చేసిన గురువు: చిత్ర పరిశ్రమకు భారతీ రాజా అందించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎందరో ఉన్నారు. రాధిక, రాధ, ముచ్చర్ల అరుణ, వంటి స్టార్ నటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. అలాగే ఆయన దగ్గర పనిచేసిన ఎందరో శిష్యులు గొప్ప దర్శకులుగా మారారు. మన తెలుగు సీనియర్ దర్శకుడు వంశీ కూడా భారతీ రాజా శిష్యుడే కావడం విశేషం.

భారతీరాజా నుంచి ఫిలింమేకర్స్ నేర్చుకోవాల్సిన పాఠాలు

భారతీయ సినిమా వేగంగా పరుగులు పెడుతున్న క్రమంలో కమర్షియల్ ఫార్ములాల నడుమ సరికొత్త సృజనాత్మక ఒరవడిని సృష్టించిన అరుదైన దర్శకుడు భారతీరాజా. ఒకప్పుడు కేవలం ఇండోర్ సెట్లకు, కృత్రిమమైన వాతావరణానికి పరిమితమైన తమిళ సినీ రంగాన్ని, స్టూడియోల నాలుగు గోడల మధ్య నుండి బయటకు తెచ్చి పచ్చని పల్లెటూరి పొలాల్లోకి.. సహజమైన లొకేషన్లలోకి నడిపించిన ఘనత ఆయనదే. సినిమా కథ అంటే కేవలం రాజులు, రౌడీలు, అసాధారణ హీరోలు మాత్రమే కాదు.. సామాన్య మానవుల జీవితాలు... వారి ఎమోషన్స్ చుట్టూ కూడా అద్భుతమైన డ్రామాను పండించవచ్చని ఆయన నిరూపించారు. నేటితరం ఔత్సాహిక చలనచిత్ర దర్శకులు కేవలం సాంకేతికతపైనే కాకుండా కథపై పట్టు సాధించాలంటే భారతీరాజా మేకింగ్ శైలిని ఒక పాఠ్యపుస్తకంలా చదవాల్సిందే. భారతీరాజా ఎంచుకునే కథాబలం అత్యంత సహజమైనది. సమాజానికి అత్యంత దగ్గరగా ఉండేది. కుల వివక్ష, గ్రామీణ ప్రాంతాల్లోని ఆచారాలు, పరువు ప్రతిష్టలు, మానవ సంబంధాలలోని సున్నితమైన కోణాలను ఆయన తన కథా వస్తువులుగా ఎంచుకున్నారు. -పదునారు వయదినిలే- (తెలుగులో పదహారేళ్ల వయసు), -ఎర్ర గులాబీలు-, -సీతాకోకచిలుక- వంటి చిత్రాలే అందుకు సజీవ సాక్ష్యాలు. నేటితరం దర్శకులు కోట్లాది రూపాయల బడ్జెట్... భారీ గ్రాఫిక్స్ ఉన్నప్పుడే సినిమా అద్భుతంగా వస్తుందనే భ్రమలో ఉన్న తరుణంలో.. బలమైన మట్టి వాసన ఉన్న కథ ఉంటే సామాన్య బడ్జెట్‌తోనూ ఇండస్ట్రీ రికార్డులను తిరగరాయవచ్చనే పాఠాన్ని భారతీరాజా కథల ఎంపిక మనకు నేర్పుతుంది. ఆయన స్క్రీన్‌ప్లే టెక్నిక్ .. పాత్రల చిత్రణ అత్యంత విలక్షణమైనవి. భారతీరాజా సినిమాల్లో హీరో, హీరోయిన్లతో పాటు ప్రతి పాత్రకూ ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యత.. స్వభావం ఉంటాయి. కథనంలో డ్రామాను నడిపించడానికి ఆయన ఎంచుకునే విజువల్ మ్యాపింగ్ - రూపకాలు, పల్లెటూరి వాతావరణాన్ని కెమెరాలో బంధించే విధానం అద్భుతంగా ఉంటాయి. సంగీతాన్ని.. ముఖ్యంగా ఇళయరాజా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను కథనంలో ఒక పాత్రలా ఎలా వాడుకోవాలో ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. దృశ్యానికి, హృదయాన్ని ఆకట్టుకునే థీమ్ కు మధ్య సమతుల్యతను కాపాడుతూ ప్రేక్షకుడు కథలో లీనమయ్యేలా స్క్రీన్‌ప్లేను ఉత్కంఠభరితంగా మలచడం ఆయన ప్రత్యేకత.

# క్యాంపస్ రొమాన్స్ కు సరిగ్గా సరిపోయే నవతరం తారలు!



కాలేజీ బ్యాక్‌డ్రాప్ -క్యాంపస్ రొమాన్స్ కథాంశాలకు ఎప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. కాలేజీ రోజుల్లోని అల్లరి, ప్రేమ, స్నేహం వంటి అంశాలు యువ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బాలీవుడ్‌లో సరికొత్త గ్లామర్..ఎనర్జీని తీసుకొస్తూ క్యాంపస్ లవ్ స్టోరీలకు పక్కాగా సరిపోతారని విమర్శకులు- ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటున్న ఏడుగురు యువ నటుల గురించి పరిశ్రమ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఈ నవతరం నటుల జాబితాలో అగస్త్య నందా ,వేదాంగ్ రైనా ముందంజలో ఉన్నారు. 'ది ఆర్చీస్' చిత్రంతో వెండితెరకు పరిచయమైన జోడీ చాక్లెట్ బాయ్ లుక్స్‌తో , నటనతో తొలి చిత్రంతోనే క్యాంపస్ వైబ్స్‌ను అద్భుతంగా పండించగలరని నిరూపించారు. ముఖ్యంగా లవర్ బాయ్ పాత్రలలోనూ, కాలేజీ విద్యార్థిగా ఉండే చార్మింగ్‌ను ప్రతిబింబించడంలోనూ ఇద్దరి శైలి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. రాబోయే రోజుల్లో మరిన్ని రొమాంటిక్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారే అవకాశం లేకపోలేదు. వీరితో పాటు ఇబ్రహీం అలీ ఖాన్, జునైద్ ఖాన్ వంటి స్టార్ కిడ్స్ కూడా రేసులో దూసుకుపోతున్నారు. తమకంటూ ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న యువ నటులు, క్లాసిక్ లవ్ స్టోరీలకు , ఆధునిక కాలేజీ డ్రామాలకు సరిగ్గా సరిపోతారని విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. నేటి తరం యువత ఆలోచనలను, వారి ప్రేమ భావాలను తెరపై ప్రతిబింబించడానికి అవసరమైన లుక్స్ , బాడీ లాంగ్వేజ్ వీరిలో పుష్కలంగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరికొందరు ప్రతిభావంతులైన యువ నటులు కూడా విభిన్నమైన లుక్స్‌తో ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు. సాంప్రదాయ లవ్ స్టోరీలు మాత్రమే కాకుండా క్యాంపస్ నేపథ్యంలో సాగే కాంప్లెక్స్ రిలేషన్‌షిప్స్, ఎమోషనల్ డ్రామాలను సైతం పండించగల సత్తా తమకు ఉందని నిరూపిస్తున్నారు. బాలీవుడ్‌లో చాలా కాలంగా మంచి ప్యూర్ క్యాంపస్ రొమాన్స్ సినిమా రాలేదనే లోటును తీర్చడానికి ఈ తరం తారలు సిద్ధంగా ఉన్నారని చెప్పొచ్చు. గతంలో రిషి కపూర్, షారూఖ్ ఖాన్, రణ్‌బీర్ కపూర్ వంటి స్టార్ హీరోలు క్యాంపస్ , లవర్ బాయ్ పాత్రలతోనే లార్జర్ దన్ లైఫ్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుత తరం నటులు కూడా అదే బాటలో పయనిస్తూ యూత్‌కు కనెక్ట్ అయ్యే కథలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా ఓటీటీ , థియేటర్లలో యువతను ఆకట్టుకునేందుకు లవ్ స్టోరీలు అత్యుత్తమ మాధ్యమంగా మారుతున్నాయి. మొత్తంగా బాలీవుడ్ నవతరం హీరోలు సరికొత్త కథలతో చిత్ర పరిశ్రమలో నూతన అధ్యాయాన్ని సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు. మేకర్స్ కూడా ఈ ఏడుగురు నటుల చార్మింగ్ లుక్స్‌ను వినియోగించుకుంటూ భారీ క్యాంపస్ ఎంటర్‌టైనర్లను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరి రాబోయే కాలంలో ఈ యువ తారలలో ఎవరు కాలేజీ లవ్ స్టోరీలతో బాక్స్ ఆఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తారో ? తదుపరి జనరేషన్ రొమాంటిక్ స్టార్స్ గా ఎవరు అవతరిస్తారో చూడాలి.

# 6 గంటల మేకప్.. 12 గంటల షూటింగ్.. కార్తీ డెడికేషన్‌కు అవాక్కవాల్సిందే!




ఇక మార్కెట్ పరంగా కూడా సర్దార్2పై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. మొదటి భాగం సక్సెస్ కావడంతో ఈ సీక్వెల్‌కు తమిళంతో పాటు తెలుగు, హిందీ మార్కెట్లలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. తమిళ స్టార్ హీరో కార్తీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ప్రాజెక్ట్‌లలో సర్దార్2 ఒకటి. డైరెక్టర్ పీఎస్ మిత్రన్ రూపొందిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన జార్జ్ సి విలియమ్స్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో సినిమా చుట్టూ మళ్లీ భారీ హైప్ ఏర్పడింది. షూటింగ్ పూర్తై చాలా నెలలు గడిచినా రిలీజ్ డేట్ పై ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందుతున్న టైమ్ లో ఆయన వెల్లడించిన విషయాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన జార్జ్ సి విలియమ్స్, సర్దార్2 తన కెరీర్‌లోనే అతి పెద్ద సినిమా అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏకంగా 8 భారీ సెట్లను నిర్మించారని, దాదాపు 15 నెలల పాటు షూటింగ్ కొనసాగిందని వెల్లడించారు. సినిమా స్కేల్‌ను బట్టి చూస్తే ఇది సాధారణ సీక్వెల్ కాదని, మొదటి భాగాన్ని మించి మరింత భారీ స్థాయిలో రూపొందించారని ఆయన కామెంట్స్ సూచిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఫైట్ సీక్వెన్స్ ఆడియన్స్ ను ఆశ్చర్యపరుస్తుందని, అలాగే ఇంటర్వెల్ బ్లాక్ థియేటర్లలో భారీ రెస్పాన్స్ ను తెచ్చుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఎడిటింగ్, సీజీ వర్క్ జరుగుతోందని, అన్ని పనులు పూర్తైన తర్వాత రిలీజ్‌పై మేకర్స్ త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముందని ఆయన సంకేతాలు ఇచ్చారు. అయితే జార్జ్ వ్యాఖ్యల్లో ఎక్కువగా ఎట్రాక్ట్ చేస్తోంది కార్తీ డెడికేషన్ గురించిన అంశమే. సర్దార్ పాత్ర కోసం ప్రత్యేకమైన మేకప్ ప్రాసెస్‌ను అనుసరించిన కార్తీ, పాత్రను నమ్మదగిన విధంగా చూపించేందుకు ఎన్నో కష్టాలు పడ్డారని ఆయన తెలిపారు. సాధారణంగా ఆ మేకప్ సుమారు ఆరు గంటల వరకు మాత్రమే పర్ఫెక్ట్‌గా ఉంటుందని, కానీ షూటింగ్ అవసరాల దృష్ట్యా కార్తీ ఎనిమిది నుంచి పన్నెండు గంటల వరకు నిరవధికంగా పనిచేసేవారని వెల్లడించారు. మేకప్ లిమిటేషన్స్ ఉన్నప్పటికీ షూటింగ్ ఆపకుండా ఫుల్ డెడికేషన్ తో పనిచేయడం తనను ఆశ్చర్యపరిచిందని జార్జ్ చెప్పారు.

# పూల లెహంగాలో ఆకట్టుకుంటున్న సుప్రీత



సాధారణంగా సోషల్ మీడియాలో సెలబ్రిటీలకు ఊహించని పాపులారిటీ ఉంటుంది. ఆ పాపులారిటీని ఉపయోగించుకొని సెలబ్రిటీలు అభిమానులకు దగ్గర అవ్వడమే కాకుండా తమ వారసులను, కుటుంబ సభ్యులను కూడా ఆడియన్స్ కు దగ్గర చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఇండస్ట్రీలోకి అడుగు పెట్టకముందే తల్లితో సమానంగా ఆదరణ అందుకుంటూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది సుప్రీత. సీనియర్ నటీమణి సురేఖ వాణి కూతురిగా సోషల్ మీడియా యూజర్స్ కి పరిచయమైన ఈ చిన్నది అక్కడ తన తల్లితో కలిసి ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ మరింత వైరల్ అయింది. లెహంగా లుక్ లో సుప్రీత అందాలు.. ముఖ్యంగా కరోనా సమయంలో తల్లితో గడిపిన ప్రతి సందర్భాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఊహించని ప్రేక్షక ఆదరణ సొంతం చేసుకుంది. అలాంటి ఈమె ఈ మధ్యకాలంలో లంగా వోణీ, చీరకట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూ మెస్మరైజ్ చేస్తోంది. ఒకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూనే.. మరొకవైపు తన గ్లామర్ అందాలతో కుర్ర కారుకు కునుకు లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. ఈమె ధరించిన లేటెస్ట్ లెహంగా విషయానికి వస్తే.. ఆరంబ్ బ్రైడల్ స్టూడియో డిజైన్ చేసిన ప్రింటెడ్ లంగాకు దీనికి కాంబినేషన్లో హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ ఆలివ్ గ్రీన్ బ్లౌజ్ ధరించి ఆకట్టుకుంది. అలాగే ఆలివ్ గ్రీన్ కలర్ చున్నీతో తన మేకోవర్ ను ఫుల్ ఫీల్ చేసుకుంది. ఇక జుట్టును పోనీటైల్ చేసిన ఈమె.. సిల్వర్ కలర్ జువెలరీ తో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసుకుంది. మొత్తానికైతే లెహంగా అందాలతో చూడచక్కని బొమ్మలా అందరి దృష్టిని ఆకర్షించింది సుప్రీత . ఇక సుప్రీత లేటెస్ట్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. నిత్యం చిట్టి పొట్టి బట్టలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఈ మధ్యకాలంలో ఎక్కువగా ట్రెడిషనల్ గా తయారవుతూ అందరి దృష్టిని ఆకట్టుకోవడంతో అమ్మడిలో మార్పు వచ్చింది అంటూ నెటిజన్స్ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. హీరోయిన్ గా తొలి అడుగు.. ఇక సుప్రీత సినిమాల విషయానికి వస్తే.. బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్, సీరియల్ నటుడు అమర్దీప్ చౌదరితో కలిసి చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి అనే సినిమా ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయం కాబోతోంది. మల్యాద్రి రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎ3 మీడియా పతాకం పై మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని నిర్మించక ముందు ఈయన వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన శబరి సినిమాను నిర్మించారు. ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటుంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

# రోయిన్లు మాత్రమే కాదు.. అందరూ బాధ్యులే!




రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా సినిమా పెద్ది ఇటీవల బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, రిలీజ్ తర్వాత కొన్ని సీన్స్ కారణంగా వివాదాల్లోనూ నిలిచింది. ముఖ్యంగా జాన్వీ కపూర్ క్యారెక్టర్ ను సినిమాలో చూపించిన తీరు మహిళలను అభ్యంతరకరంగా చూపించిందనే విమర్శలకు దారితీసింది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరగడంతో డైరెక్టర్ బుచ్చిబాబు సానా క్షమాపణలు చెప్పడమే కాకుండా, వివాదాస్పద సన్నివేశాలను తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి అదా శర్మ తాజాగా ఈ వివాదంపై స్పందించిన తీరు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తన కొత్త సినిమా గవర్నర్ ప్రమోషన్లలో భాగంగా మీడియాతో మాట్లాడిన అదా శర్మను, జాన్వీ కపూర్ పాత్ర చుట్టూ నెలకొన్న వివాదం గురించి ప్రశ్నించారు. అయితే ఈ అంశంపై నేరుగా వ్యాఖ్యానించేందుకు ఆమె నిరాకరించారు. తాను పెద్ది సినిమాలో నటించలేదని, ఇంకా ఆ సినిమాను కూడా చూడలేదని, కాబట్టి ఆ సినిమాలోని సీన్స్ లేదా క్యారెక్టర్ గురించి తాను మాట్లాడటం సరైనది కాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా, తాను ఇండస్ట్రీకి బయటి వ్యక్తిగా వచ్చినందున తన ప్రయాణం, తన అనుభవాలు పరిశ్రమలో జన్మించిన లేదా పెరిగిన వారి అనుభవాల కంటే భిన్నంగా ఉంటాయని, అందుకే ఈ విషయంలో తన కామెంట్ సరైన సందర్భంలో ఉండకపోవచ్చని పేర్కొన్నారు. అయితే పాత్రల ఎంపిక, స్టోరీ సెలెక్షన్ విషయంలో నటీనటులు ఎంత బాధ్యతగా ఉండాలనే అంశంపై అదా శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# పేదోడి నడ్డీ విరుస్తున్న బిజేపి : ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**సత్య వార్త మహబూబ్ నగర్**

పేదోడి నడ్డీ విరుస్తున్న బిజేపిని గద్దెదించాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి . టి పిసిసి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద గల గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. అంతకుముందు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాదయాత్ర గా అశోక్ టాకీస్ వరకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి మహాధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ధర్నా ఒక్కరోజు కార్యక్రమం మాత్రమే కాదు, ఇది నిరంతర పోరాటానికి నాంది కావాలన్నారు. దేశంలో ఒక చేతగాని ప్రభుత్వం కొనసాగుతోందని, విదేశీ ఒత్తిడులకు లోనై, ప్రజల సమస్యలను పట్టించుకోని పాలన సాగుతోందని ఆరోపించారు . దేశ ప్రజలను బాధల్లోకి నెట్టే విధంగా బిజెపి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుకుంటున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజల్ని నలిపేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో, సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలపై భారం పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పాలన సాగించింది అని అన్నారు.కానీ ఇప్పుడు అనుభవం లేని పాలన కారణంగా ప్రజలపై భారాలు పెరుగుతున్నాయి. మతాలు, కులాల మధ్య విభేదాలు పెంచి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం దేశాన్ని సరైన దిశలో నడపలేకపోతోందని అన్నారు. పన్నెండు సంవత్సరాల పాలన తర్వాత కూడా ప్రజల సమస్యలకు సరైన పరిష్కారాలు చూపలేకపోతున్నారని, మధ్యతరగతి, పేదవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ధరల భారం పేదవాడి పైన పెరిగిపోయిందన్నారు. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, 2004లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన మద్దతుతో మార్పు వచ్చినట్టే, ఇప్పుడు కూడా మనం కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామ గ్రామానికి, బస్తీ బస్తీకి వెళ్లి ప్రజలకు నిజాలు తెలియజేయాలని, ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేయాలని చెప్పారు. దేశానికి సమతుల్యమైన నాయకత్వం అవసరం ఉందని అందరినీ సమానంగా చూసే నాయకుడు అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా రాహుల్ గాంధీ కి అవకాశం ఇవ్వాల్సిన సమయం ఇప్పుడు వచ్చిందన్నారు. ఒకే వ్యక్తికి పదే పదే అధికారం ఇవ్వడం వల్ల అభివృద్ధి ఆగిపోతుందని, ప్రపంచ దేశాల్లో కూడా పరిమిత కాలం మాత్రమే నాయకత్వం ఇస్తారన్నారు. మన దేశంలో కూడా మార్పు అవసరం ఉందని, ప్రారంభమైన ఈ ఉద్యమం రాబోయే రోజుల్లో మరింత బలపడాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకతాటిపైకి వచ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర్ మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, డిసిసి నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సాయిబాబా, రాములు యాదవ్, సిజె బెనహర్, రాజు భాయి, ఫయాజ్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, నగర కార్పొరేటర్లు హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు బానిస కాకండి... జీవితానికి కొత్త దిశను ఎంచుకోండి వనపర్తి డిసిఆర్బి డిఎస్పీ:బాలాజీ నాయక్

**- వ్యసనాల నుంచి విముక్తి... సరికొత్త జీవితానికి శ్రీకారం**

**- ప్రభుత్వ ఆస్పత్రి డి-అడిక్షన్ సెంటర్లో 50 మందికి ప్రత్యేక కౌన్సిలింగ్**

**-డ్రగ్స్ రహిత వనపర్తి లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు**



**వనపర్తి, జూన్ 10: సత్యవార్త జిల్లా ప్రతినిధి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో మరియు వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఆదేశాల మేరకు బుధవారం రోజు సాయంత్రం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలోని డి–అడిక్షన్ సెంటర్లో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ శ్రీ బాలాజీ నాయక్ గారు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసైన 50 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజిక అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు మనిషి శరీరాన్నే కాదు, ఆలోచనా విధానాన్ని, వ్యక్తిత్వాన్ని, కుటుంబ బంధాలను కూడా నాశనం చేస్తాయి. వ్యసనానికి బానిసైన వ్యక్తి తన జీవిత లక్ష్యాలను కోల్పోవడంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా తీవ్ర మానసిక వేదన కలిగిస్తాడు. సమాజంలో నేరాలు పెరగడానికి, కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి మాదకద్రవ్యాల వ్యసనం ఒక ప్రధాన కారణంగా మారుతోంది. వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా భావించి, వారికి సరైన మార్గదర్శనం, వైద్య సహాయం, కౌన్సిలింగ్ అందించడం ద్వారా తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం సమాజం బాధ్యత. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, కుటుంబ విలువలపై దృష్టి పెట్టాలి. డ్రగ్స్ రహిత వనపర్తి, డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజ రక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ ఎస్సై,అంజద్, షీ టీం, భరోస, ఏ హెచ్ టి యు, నార్కోటిక్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుంది...

**-అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్**

**పెబ్బేరు జూన్10 సత్యవార్త ప్రతినిధి**

మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్ అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ, పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో వార్డు సభ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు రోడ్డు భద్రత, బాల్యవివాహాల నిర్మూలన, వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు, పంట మార్పిడి, ఎరువుల వాడకం, పరిసరాల పరిశుభ్రత, వన మహోత్సవం, జల సంరక్షణ, పాఠశాలల్లో సౌకర్యాలు సహా తదితరాంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి, తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు. అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ. 20 వేల లబ్ధి పొందవచ్చని



తెలిపారు.హోహో ప్రభుత్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు.ఈ గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ,జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, పెబ్బేరు వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి,మండల వ్యవసాయ శాఖ అధికారి,ఎంపీఓ,ఎస్ఐ, పంచాయతీ కార్యదర్శి,ప్రజాప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మన అందరి ధ్యేయం

**- పిల్లలను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే: అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు**

**సత్యవార్త నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి జూన్ 10**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "డ్రగ్స్ రహిత తెలంగాణ -- మన అందరి ధ్యేయం" అనే అవగాహన సదస్సు బుధవారం సాయి గార్డెన్‌లో నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.యువత భవిష్యత్తును కాపాడేందుకు సమాజం కృషి చేయాలిఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత, ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు మంచి విలువలు, సమాజం పట్ల గౌరవం పెంపొందేలా పెంచి వారికి ఉజ్వల భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత కుటుంబాలపై ఉందన్నారు. డ్రగ్స్ సమాచారం ఉంటే 1908కు సమాచారం ఇవ్వాలిడ్రగ్స్ వినియోగం, విక్రయాలు, రవాణా లేదా గంజాయి సాగు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1908 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని




తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువత డ్రగ్స్ నిర్మూలనలో ముందుండి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. వివిధ వర్గాల ప్రతినిధుల భాగస్వామ్యంఈ కార్యక్రమంలో టీజీఎన్ఏబీ డీఎస్పీ బుచ్చయ్య, నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ అశోక్ రెడ్డి, ఎస్సై గోవర్ధన్, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రవిశంకర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఫణికాంత్, జిల్లా ఈగల్ టీమ్ ఎస్సై రామ్‌లాల్ పాల్గొన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు, పాన్‌షాప్ యజమానులు, మెడికల్ షాప్ యజమానులు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన పొందారు.

# జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలలు ఒక్కటి కూడా ఉండటానికి వీళ్ళేదని : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి జూన్ 10 సత్యవార్త జిల్లా ప్రతినిధి**

వనపర్తిజిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, కిచెన్ షెడ్స్ సహా పలు అంశాలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మరుగుదొడ్ల సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క పాఠశాలకు మరుగుదొడ్లు అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం తప్పక ఉండాలని, టాయిలెట్ సౌకర్యం లేని పాఠశాలలు ఒక్కటి కూడా ఉండటానికి వీళ్ళేదని ఆదేశించారు. గతంలో విద్యాశాఖ అధికారుల నుంచి తెప్పించుకున్న నివేదిక ప్రకారం 97 పాఠశాలలకు టాయిలెట్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వాటిల్లో కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాగా, 26 పాఠశాలల్లో నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వాటిని జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలను సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠశాలల్లో మంజూరైన కిచెన్ షెడ్యూల్ నిర్మాణాలను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాలోని ఎంఈఓ లు తమ పరిధిలోని పాఠశాలల్లో అపార్ ఐడీల జనరేషన్ ప్రక్రియ పెంచాలన్నారు. దాంతో పాటుగా యూడైస్ అప్డేషన్, ఎంఈఓ ల స్కూల్ విజిట్స్ కూడా పెరగాలని ఆదేశించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలకు సంబంధించి మండల అధికారులు తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. జిల్లాలో అన్ని పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

ఉపాధి హామీ పథకంలో భాగంగా మొత్తం యాక్టివ్ జాబ్ కార్డుల్లో 40% కూలీలకు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలకు ఆదేశించారు. కొత్త పనులు చేపట్టి కూలీలకు పని కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు, వార్డు మెంబర్లకు ఇంకుడు గుంతలను మంజూరు చేసి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కల పెంపకం కోసం స్థలాలను గుర్తించి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలని ఆ దిశగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని సూచించారు. ఇక జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధిదారులను గుర్తించి వేగంగా వారి దరఖాస్తులను ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా లబ్ధిదారులకు 20వేల రూపాయల లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నింటిలో గ్రామ కార్యదర్శులు భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా 'ఏక్ పేడ్- మాకే నామ్' అనే వాల్ పోస్టర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిని ఉమాదేవి, గృహ నిర్మాణ శాఖ పీడి విఠోబా, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమించి ప్రభుత్వ బడులో ప్రవేశాలు పెంచుదాం పిఆర్సి సాధించుకుందాం

**- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటయ్య.**




**సత్య వార్త.మక్తల్.**

ఉపాధ్యాయులందరు అంకితభావంతో పనిచేస్తు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచుతూ ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశగా కృషి చేద్దామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.పెంటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ లో తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ అధ్యక్షతన జిల్లా కార్య నిర్వాహకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చాలా రోజులుగా ఎదురు చూస్తున్న పిఆర్సి కోసం ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించిన స్పందించడం లేదని పిఆర్సి సాధనకై ఉద్యమ బాటనే పట్టాల్సిన అవసరం ఉందన్నారు. మార్గదర్శకాలు విడుదలైన తర్వాతనే నాణ్యమైన వైద్యం అందించడం కోసంఉపయుక్తమైన హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ పలు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర శాఖ ఇప్పటికీ 60 సార్లు వినతి పత్రాలిచ్చిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శేర్ కృష్ణారెడ్డి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గుంపు బాలరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్,జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్.మహిళా కన్వీనర్ నర్మద, జిల్లా బాధ్యులు భీమ్రెడ్డి, వెంకట్రాములు, నర్సిరెడ్డి అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు రవికుమార్,వసంత్ కుమార్, రమేష్,అమ్రేష్ సురేష్, నర్సింలు, నగేష్, అంజి, రవీందర్ నాయక్, రవివర్మ, రాకేష్,పాల్గొన్నారు.

# దత్తాత్రేయని సేవలో జిల్లా కలెక్టర్ ప్రియాంక దంపతులు

**సత్య వార్త.మక్తల్.**

మండల పరిధిలోని కృష్ణా నది పరివాహకంలో కొలువై ఉన్న శ్రీపాద వల్లభ దత్తాత్రేయ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక భర్తఆర్ వి కర్నన్.దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శాలువాలు కప్పి సన్మానించారు. ఆలయ చరిత్ర జీర్ణావస్థలో ఉన్న ఆలయాని శ్రీ శ్రీ విఠలానంద సరస్వతి మహారాజ్ పునరుద్ధించారని వారికి స్వామీజీ వివరించారు.రాష్ట్ర సరిహద్దులు అతి పురాతనమైన పవిత్ర దత్తాత్రేయ క్షేత్రం దర్శించుకోవడానికి దేశంలోని పలు రాష్ట్రాల మంత్రులు, ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు దంపతులతో సహా స్వామికి ప్రత్యేక పూజలు చేసి తన మొక్కలను తీర్చుకుంటుంటారు అందులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిహెచ్ఎంసిలో



సీనియర్ ఐఏఎస్ అధికారి హోదాలో ఉన్న ఆర్ వి కర్నన్.దంపతులు శ్రీ శ్రీపాద శ్రీ వల్లభుని దర్శించుకుని కృష్ణా నది మధ్యలో కోలువై ఉన్న కురువపురంలోని దత్తాత్రేయుని దర్శించు కున్నారు.

# ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

**- పూడికతీత చేపట్టి నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నీటి నిలువ సామర్థ్యం పెంచుతాం**

**- కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు**

**- మేడిగడ్డ పునరుద్ధరణకు కృషి**

**- రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**- జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలకు ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి**

**- సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు క్షేత్రస్థాయిలో పరిశీలన**



**సత్యవార్త ప్రతినిధి, నిజామాబాద్:**

ఉత్తర తెలంగాణ జిల్లాలలోని సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ తదితరులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రిజర్వాయర్ కు సంబంధించిన వివరాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. 106 కోట్ల రూపాయల వ్యయంతో 7,975 ఎకరాల ఆయకట్టుకు నీరందించే జాకోరా, చందూర్ ఎత్తిపోతల పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. హెలికాప్టర్ లో సిద్దాపూర్ చేరుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కర్, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, నిజామాబాద్ అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ తదితరులు హెలిప్యాడ్ వద్ద పుష్ప గుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాకోరాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి, పౌర సరఫరాలకు ఎనలేని ప్రాముఖ్యత ఇస్తోందని గుర్తు చేశారు. భూసేకరణ, అటవీ అనుమతులు, ఆర్ అండ్ ఆర్ తదితర వాటి కోసం ప్రభుత్వం రూ. 5వేల కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇందులో భాగంగానే లోయర్ మానేరు, మిడ్ మానేరు డ్యామ్ లు, కడెం ప్రాజెక్టులలో నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించేందుకు పూడికతీత చేపడుతున్నామని తెలిపారు. అదే తరహాలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్, ఉత్తర తెలంగాణ జిల్లాలకు అత్యంత కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులలో కూడా పూడికతీత చేపట్టి రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం పెంపొందిస్తామని ప్రకటించారు. కాలువ కట్టలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి లోపభూయిష్ట నిర్మాణం, డిజైన్ల వల్ల కొన్నాళ్ళకే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయినప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన మేడిగడ్డ బ్యారేజి కొన్ని రోజులకే కూలిపోవడం జరిగిందని, కానీ నిజాం నవాబు నిర్మించిన నిజాంసాగర్, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిన శ్రీరాంసాగర్, నాగార్జున సాగర్, జూరాల ప్రాజెక్టులు మాత్రం ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఎంతో గట్టిగా నిలబడి ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు. కాగా, సిద్దాపూర్ రిజర్వాయర్ పనుల పూర్తి కోసం సవరించిన ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధులను తప్పక కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతాంగ ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా తమ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. దేశంలోనే మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు కలుపుకుని 295 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. అందులో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల ద్వారా 145 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 48గంటల లోపే రైతుల ఖాతాలలో బిల్లులు జమ చేస్తూ రూ. 35 వేల కోట్లు చెల్లించామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో సైతం రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి భరోసా కల్పించారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 5లక్షల కుటుంబాలలోని 3.25 కోట్ల మందికి ఒక్కొక్కరికి ప్రతీ నెల ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ సలహాదారు, స్థానిక శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటగా తన నియోజకవర్గంలో జాకోరా, చందూర్ ఎత్తిపోతల పోతకాలను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో బాన్సువాడ నియోజకవర్గ రైతులు పంటలు సాగు చేస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్నారని అన్నారు. మొత్తం లక్షా 48 వేల ఎకరాలలో పంటలు పండిస్తున్నారని, 95వేల ఎకరాల ఆయకట్టుకు నిజాంసాగర్ నీరు సమకూరుతోందని తెలిపారు. 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు జలాలు అందిస్తున్నామని, నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో లేని మిగతా భూములకు కూడా సాగు జలాలు అందించాలనే కృత నిశ్చయంతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలో సాగు నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిద్దాపూర్ రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్, సీ.ఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, తహసిల్దార్ ప్రశాంత్, సర్పంచ్ సాయిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# చెత్తను పక్కాగా వేరు చేయాలి

**-పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి**

**-పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి**

**-ట్రాఫిక్ నియమాలు పాటించాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహణ**



**రాజన్న సిరిసిల్ల,సత్యవార్త:**

రుద్రంగి ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా పక్కాగా వేరు చేయాలని, పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రుద్రంగి మండలం మానాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ, బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, ఆయిల్ పామ్, రోడ్డు భద్రత, నియమాలు, గిరిజన సంక్షేమ శాఖ పథకాలు తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6వ తేదీన ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా 10 థీమ్ లతో 10 శాఖల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ – 2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు. తడి, పొడి, సానిటరీ, ప్రత్యేక చెత్త గా వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు. నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు. పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు ఉండవని వివరించారు. ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు. పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 25 వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు పంపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యువతకు మార్కెట్ లో డిమాండ్ ఉన్న కోర్సులలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారని, 18 నుంచి 35 ఏండ్ల లోపు వారు పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని.. ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపు నిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటుతూ.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామస్థులందరికీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మానాల గ్రామస్థులంతా ప్రభుత్వ బడికి కే పిల్లలను పంపిస్తామని తీర్మానించడంపై అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని, ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, ప్రవేశాలు పెరగాలని పేర్కొన్నారు. మానాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. మొక్కలు నాటాలని.. పచ్చదనం పెంచాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు దూరం చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనుల కోసం స్థానిక వనరుల నుంచి ఇసుక తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక తాగునీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేస్తున్న కృషిని అభినందించారు. మారుమూల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహణ పై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దిన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సంగీత, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, మిషన్ భగీరథ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి దక్కిన అత్యున్నత రక్తదాత ప్రోత్సాహక పురస్కారం : గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకునేందుకు ఆహ్వానం







**వనపర్తి సత్యవార్త బ్యూరో (జూన్ 10)**

వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డికి అత్యున్నత రక్తదాత ప్రోత్సాహక పురస్కారం లభించడం వనపర్తి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. సమాజంలో స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కల్పిస్తూ,యువతను రక్తదానం వైపు ప్రోత్సహించడంలో ఎమ్మెల్యే చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేక మంది రోగులకు ప్రాణదానంగా నిలిచే రక్తాన్ని అందించగలిగారు. రక్తదాన ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే నాయకత్వం, యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు చేసిన కృషి విశేష ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా అత్యున్నత రక్తదాత ప్రోత్సాహక పురస్కారాన్ని అందుకోవాల్సిందిగా ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఆహ్వానం అందడం మరింత గర్వకారణంగా మారింది. మానవతా విలువలను చాటిచెప్పే ఈ గుర్తింపు వనపర్తి ప్రజలందరికీ ఆనందాన్ని కలిగిస్తుండగా, భవిష్యత్తులో కూడా రక్తదాన ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తూ ప్రాణాలను కాపాడే సేవా కార్యక్రమాలకు కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన, యువకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఎమ్మెల్యే గ కృతజ్ఞతలు తెలిపారు.

## పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆర్థిక సహాయం

**- అభినందించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**సత్య వార్త మహబూబ్ నగర్**

పాలమూరు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టు సోదరులకు ఆర్థిక సహాయం అందించారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇటీవల శస్త్ర చికిత్స చేసుకున్న ఎబిఎన్ వీడియో జర్నలిస్టు సంతోష్ కు 20 వేల రూపాయలు, సీనియర్ జర్నలిస్టు ఎస్ ఎస్ జాంగీ తన మందులు కొనుగోలు నిమిత్తం 10 వేల రూపాయల చెక్కులను పాలమూరు జర్నలిస్టు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జర్నలిస్టు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటి జర్నలిస్టు సోదరులకు అండగా నిలిచి, ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం అని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో సైతం కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షులు వాకిట అశోక్ కుమార్, సభ్యులు పరిపూర్ణం, ప్రవీణ్, నర్సిగ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ఆగని పల్లె వెలుగు బస్సులు

**-గంటల తరబడి ఎదురుచూపులు**

**-భారంగా సురక్షిత ప్రయాణం**



**సత్యవార్త ప్రతినిధి దేవరకద్ర జూన్10**

ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం కొందరు డ్రైవర్ల నిర్లక్ష్యంతో మహిళలకు శాపంగా మారింది. మున్సిపాలిటీ వస్తే మా మా గ్రామం అభివృద్ధి చెందుతుందని అనుకున్న గ్రామస్తులకు నిరాశ మిగిలింది. బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీలోని పెద్ద గోపులాపూర్ గ్రామం వద్ద ప్రయాణికులు గంటల తరబడి బస్సు కోసం వేచి ఉన్నారు. పల్లె వెలుగు బస్సులు ఆపకుండా వెళ్లడంపై ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పదుల సంఖ్యలో బస్సులు వెళ్తున్న డ్రైవర్లు పట్టించుకోకపోవడంతో సురక్షిత ప్రయాణం భారంగా మారుతుందని మహిళలు వాపోతున్నారు. మున్సిపాలిటీలో నే ఆగకుంటే గ్రామాల వద్ద బస్సులు ఎలా ఆగుతాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై నారాయణపేట డిపో మేనేజర్ ను వివరణ కోరెందుకు 'దిశ' ప్రతినిధి ప్రయత్నించిన డిపో మేనేజర్ స్పందించలేదు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Publisher, Printer, Owner Tatikonda Krishna, H.No 2-17-100, JaiBheemnagar, Kollapur Village & Mandal, Mahabubnagar Dist (TS) 509102 Printed at Shiva Sai Printers, H.No 4-10-58, 59 Ramnagar,Mahabubnagar-509001.
Published From H.No 2-17-100, JaiBheemnagar, Kollapur Village & Mandal, Mahabubnagar Dist (TS) Ph:08542-250511,9440752375 e mail satyavartha@rediffmail.com, Editor:Tatikonda Krishna